క్లుప్తంగా

రైతు బీమా చేయించుకోవాలి

జూలపల్లి: కొత్తగా వ్యవసాయ భూములకు సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకాలు తీసుకున్న రైతులు బీమా వర్తించేందుకు దరఖాస్తులను సమర్పించాలని మండల వ్యవసాయాధికారి ప్రత్యూష సూచించారు. 18 సంవత్సరాలు దాటి 59 లోపు వయస్సుండి జూన్ 5 లోపు పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన కొత్త రైతులు తమకు సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌తోపాటు నామినీ ఆధార్ కార్డుతో ఈనెల 13 లోగా దరఖాస్తు అందించాలన్నారు.

ఎలిగేడు: రైతు బీమా 8వ పాలసీ సంవత్సరం ఈనెల 14 నుంచి ప్రారంభమవుతుందని, జూన్ 2024 నుంచి 2025 జూన్ 5 వరకు కొత్తగా భూమి పాస్ పుస్తకం వచ్చిన రైతులు ఈనెల 13 లోగా రైతు బీమాకు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఉమాపతి సూచించారు. 1966 ఆగస్టు 14 నుంచి 2007 ఆగస్టు 14 మధ్య 18 నుంచి 59 ఏళ్ల లోపున్న రైతులు అర్హులన్నారు.

నేడు పీఏసీఎస్, కేడీసీసీ బ్యాంక్ భవనాలు ప్రారంభం



కమాన్‌పూర్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్, కేడీసీసీ బ్యాంకు భవనాలను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమవారం ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ అన్వర్ ఆదివారం తెలిపారు. మండల రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పాత పద్ధతిలో గురుకుల టెండర్లు నిర్వహించాలి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న లింగమూర్తి

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులకవసరమైన ఆహార పదార్థాలను సరఫరా చేసే టెండర్ల ప్రక్రియను పాత విధానంలోనే కొనసాగించాలని మంత్రి శ్రీధర్‌బాబును గురుకుల కాంట్రాక్టు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు లింగమూర్తి కోరారు. ఆదివారం రాఘవాపూర్‌కు వచ్చిన మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. కొత్తగా అమల్లోకి తెచ్చిన టెండర్ల విధానం బడా కాంట్రాక్టర్లకే మేలు చేసేలా ఉందన్నారు.

చట్ట సవరణ చేయాలి



బస్టాండ్ వద్ద ప్లకార్డులతో నాయకుల నిరసన

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వర్తింపజేసేలా కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కల్లెపల్లి అశోక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద ఆదివారం ప్లకార్డులతో పార్టీ నేతలతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. బీజేపీ పాలిత రాష్ట్రాలైన గుజరాత్, యూపీ తదితర రాష్ట్రాల్లో మైనార్టీలకు బీసీ రిజర్వేషన్లు వర్తింపజేస్తూ తెలంగాణలో అందుకు విరుద్ధంగా వ్యవహరించడమేమిటని ప్రశ్నించారు. నాయకులు రవీందర్, ప్రశాంత్, శ్రవణ్, నవీన్, అజయ్, రామ్‌చరణ్ తదితరులున్నారు.

కుక్కలతో పరేషాన్



గోదావరిఖని: స్థానిక సింగరేణి స్టేడియంలో రోజురోజుకు కుక్కల బెడద ఎక్కువైపోయిందని, వాకింగ్‌తోపాటు వ్యాయామం కోసం వచ్చే స్థానికులపై కుక్కలు దాడి చేస్తున్నాయని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ అన్నారు. సింగరేణి యాజమాన్యం స్పందించి కుక్కల బారి నుంచి కార్మిక కుటుంబాలను కాపాడాలని కోరారు.

గుండెపోటుతో మాజీ కార్మికుడు మృతి

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీకి చెందిన రిటైర్డ్ మాజీ సింగరేణి కార్మికుడు, రాజుగారి టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు మద్దునూరి కృష్ణంరాజు ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. కృష్ణంరాజు 40 ఏళ్ల నుంచి కాలనీలో నివాసముంటున్నాడు. కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో కరీంనగర్‌లో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం హఠాత్తుగా గుండెపోటు రావడంతో మృతిచెందాడు.



ఏసీ ఫంక్షన్ హాల్‌లో అమర్చిన కూలర్లు



పని చేయని ఏసీలు

కమ్యూనిటీ హాల్.. సమస్యల వలయం

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మిక కుటుంబాలతోపాటు ప్రభావిత గ్రామాల ప్రజలు శుభకార్యాలు నిర్వహించేకునేందుకు గాను కొన్నేళ్ల క్రితం రామగుండం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలో సింగరేణి ఆధ్వర్యంలో కార్మికుల కోసం రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ఏసీ కమ్యూనిటీ హాల్ ప్రస్తుతం అపరిశుభ్రతతో అనేక సమస్యలతో నిండి ఉంది. కార్మిక సంక్షేమం కోసం సింగరేణి యాజమాన్యం కృషి చేస్తుందని చెప్పుకుంటున్న యజమాన్యం మాత్రం కమ్యూనిటీ హాల్‌లో కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కార్మిక కుటుంబాలు వాపోతున్నాయి. ప్రస్తుతం ఏసీ కమ్యూనిటీ హాల్‌లో ఏసీలు పని చేయకపోవడంతో కూలర్లను ఉపయోగిస్తున్నారు. కమ్యూనిటీ హాల్ నిర్వహణ సరిగా లేక దుర్వాసన వస్తోందని అంటున్నారు. నేలపై వేసిన టైల్స్ పగిలిపోయి ఉన్నాయి. ఏసీల నుంచి ఏసీ కంప్రెసర్లు దొంగిలించారు. ఆర్జీ–2 ఏరియా యాజమాన్యం స్పందించి కమ్యూనిటీ హాల్‌లోని ఏసీలకు మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కార్మిక కుటుంబాలు, కాలనీ, ప్రభావిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



దొంగిలించిన ఏసీ కంప్రెసర్లు



పగిలిపోయిన టైల్స్

నీటి ట్యాంకు ఎక్కి నిరసన



శ్రావణ్

కాల్వశ్రీరాంపూర్: మిషన్ భగీరథ నీరు సరఫరా చేయడం లేదని జాఫర్‌ఖాన్‌పేట గ్రామంలో ఆదివారం వార్డు మాజీ సభ్యుడు నీటి ట్యాంకు ఎక్కి నిరసన తెలిపాడు. గ్రామంలో నీటి సరఫరా చేయడం లేదని అధికారులకు చెబితే స్పందించడం లేదని, అందుకే ట్యాంకు ఎక్కి నిరసన తెలిపానని ఏడో వార్డు మాజీ సభ్యుడు తిప్పని శ్రావణ్ పేర్కొన్నాడు. తమ పదవీకాలం ముగియడంతో గ్రామంలో సమస్యలు చెబితే పట్టించుకునేవారు కరువయ్యారని, తామెవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని వాపోయాడు. ట్యాంకు నిండా నీళ్లున్నా వీధులకు విడుదల చేయడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో నీటి సరఫరా సక్రమంగా కొనసాగించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.



ట్యాంకు ఎక్కిన శ్రావణ్

రోడ్డుపై విద్యుత్ స్తంభాలు



సుల్తానాబాద్: సుల్తానాబాద్ నుంచి పూసాలకు రహదారి పనులు జరుగుతున్నాయి. సదరు కాంట్రాక్టర్ రోడ్డుపై విద్యుత్ స్తంభాలున్నా పనులు కొనసాగిస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. భవిష్యత్ తరాల కోసం రోడ్డు వెడల్పు చేస్తుండగా.. రోడ్డు మీదున్న స్తంభాలు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వీడి ప్రజల అవసరం మేరకు పనులు చేయాలని కోరుతున్నారు.

శివశంకర్ త్యాగం మరువలేనిది



భూమిపూజ చేస్తున్న పుట్ట మధూకర్

మంథని: బీసీల అభ్యున్నతికి కేంద్ర మాజీ మంత్రి దివంగత పుంజాల శివశంకర్ చేసిన త్యాగాలు మరువలేనివని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మంథనిలోని మహనీయుల చౌక్‌లో పుంజాల శివశంకర్, మాజీ ఎంపీ పూలన్ దేవి జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం శివశంకర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. బీసీ సామాజిక వర్గానికి రాజ్యాధికారమే ముగింపు అని శివశంకర్ తన ఆత్మకథలో రాశారని అన్నారు. కేంద్ర మంత్రిగా, గవర్నర్‌గా, న్యాయమూర్తిగా పనిచేసిన ఆయన బీసీల హక్కుల కోసమే పోరాటం చేశారని గుర్తు చేశారు. మహనీయుల చరిత్రను చాటి చెప్పాలనే ఆలోచనతో పదేళ్లుగా ఎంతో మంది మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నానని అన్నారు. అలాగే పూలన్ దేవి సైతం అనేక ఆటుపోటులను ఎదుర్కొని అత్యున్నత స్థానమైన పార్లమెంట్‌లో కూర్చుండి మహిళా లోకానికి గొప్ప సందేశం ఇచ్చిందని తెలిపారు.

ధర్మారం మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా చంద్రయ్య



సభ్యులతో ఎన్నికల అధికారి రాజుకుమార్

ధర్మారం: ధర్మారం మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా నార చంద్రయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం భవనంలో ఆదివారం గ్రామ శాఖ సర్వసభ్య సమావేశం జరిగింది. పలు అంశాలపై చర్చించిన తర్వాత కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా గాండ్ల స్వామి, నార ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా సాన జయాకర్, బండారి స్వామి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కడారి కుమార్, కోశాధికారిగా నార సురేందర్, సహాయ కార్యదర్శిగా నార ప్రేమ్ సాగర్, తోట శ్రీకాంత్, ప్రచార కార్యదర్శిగా నార సంజీవ్, సభ్యులుగా బొలిశెట్టి లక్ష్మయ్య, బండారి సాహిత్య, పుప్పాల అనుక్, బండారి మనోజ్, ఆవుల శంకరయ్య, మాదాసు శంకరయ్య ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా మండల ప్రధాన కార్యదర్శి రాజుకుమార్ వ్యవహరించారు.

నియామకం



రవీందర్‌రెడ్డి, తిరుపతిని సన్మానిస్తున్న సభ్యులు

జ్యోతినగర్: అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా గోదావరిఖనికి చెందిన చల్లా రవీందర్‌రెడ్డి, పీఆర్‌వోగా ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి చెందిన జనగామ తిరుపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు పుల్లం రాజు ప్రకటించారు. ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో పుల్లం రాజు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి జాతీయ ప్రధాన కార్యదర్శి భేతి తిరుమల్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

పునాదులకే పరిమితం

- రోడ్డుపై వారసంత
- రూ.8కోట్లు మంజూరైనా సాగని వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులు



పునాది దశలో సుల్తానాబాద్‌లోని వెజ్, నాన్‌వెజ్ మార్కెట్

సుల్తానాబాద్: ప్రజల సౌకర్యార్థం ఒకే దగ్గర వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ ఉండాలనే సంకల్పంతో గత ప్రభుత్వం రూ.8కోట్లు మంజూరు చేసింది. పనులకు అప్పటి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రెండేళ్లు కావస్తున్నా.. మార్కెట్ పనులు జరగకపోవడంతో వారసంతను రోడ్డుపైనే కొనసాగించడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అలసత్యంతోపాటు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా బిల్లులు రావడం లేదనే సాకు చూపుతూ పనులు చేయకపోవడమేమిటని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వే నంబర్ 779లో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ కోసం ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. మేజర్ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపల్‌గా ఆవిర్భావించిన తర్వాత పట్టణ రూపురేఖలు మారాలనే సంకల్పంతో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ మంజూరు చేసినా.. ఆచరణ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పట్టణానికి దూరంగా..

సుల్తానాబాద్ పట్టణంతోపాటు చుట్టుపక్కల ప్రజలు మార్కెట్‌తోపాటు వివిధ సామగ్రి కొనుగోలు చేసేందుకు మండల కేంద్రానికి వస్తూపోతుంటారు. పట్టణం చివరన వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులు ప్రారంభించే సమయంలోనే పలు విమర్శలు వచ్చినా.. ప్రభుత్వ స్థలం కొరత కారణంగా పనులు ప్రారంభించాల్సి వచ్చిందని అప్పటి అధికారులు, ప్రజాప్రతినిదులు తెలిపారు. పట్టణానికి దూరంగా ఉందనే కారణంతో దుకాణాల నిర్వాహకులు సైతం ఆసక్తి చూపడం లేదు. మళ్లీ యధావిధిగా వ్యాపారులంతా పట్టణంలోని పాత మార్కెట్ వద్దే రోడ్డుపైనే నిర్వహిస్తున్నారు. మిగతా సమయంలో పాత మార్కెట్‌లోనే కొనసాగుతుండగా.. నాన్‌వెజ్ గది మాత్రం అపరిశుభ్రంగా రోడ్డుపై కొనసాగుతోంది.

మరోచోట ఏర్పాటు చేయాలి

ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు మరోచోట వెజ్, నాన్‌వెజ్ సమీకృత మార్కెట్ భవనం ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. ఇరిగేషన్ స్థలంతోపాటు ఎస్సారెస్పీ స్థలం ముందు భాగం, కోర్టు ముందు భాగం ఖాళీగానే ఉంటుందని, వారసంత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు భావిస్తున్నారు. ప్రజలకు సౌకర్యంగా ఉండేలా మార్కెట్ ఏర్పాటు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

పనులు ప్రారంభించాలి



వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులు కాంట్రాక్టర్ ప్రారంభించేలా అధికారులు ఒత్తిడి తేవాలి. ప్రజల సౌకర్యార్థం నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించగా.. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. పనులు పూర్తయిన తర్వాత నిధులు రావా.

– నూర శ్యామ్, మాజీ ఎంపీటీసీ, సుల్తానాబాద్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులు పునాదుల్లోనే నిలిచిపోయాయని దృష్టికి తెచ్చారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభమయ్యేలా చూస్తా. ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి కాంట్రాక్టర్ పనులు చేసేలా చూస్తా. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ప్రయత్నిస్తా.

– తిప్పరాజు రమేశ్, మున్సిపల్ కమిషనర్, సుల్తానాబాద్



కమాన్‌పూర్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే దారి, సుభాష్‌నగర్ వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు కొన్ని రోజుల నుంచి వెలగడం లేదు. దీంతో ఈమార్గం గుండా వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రెండు ప్రాంతాల్లో మలుపులు ఉండడంతో చీకట్లో ఎదురుగా వచ్చే వాహనాలు, దారి వెంట వెళ్లే వారు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశముందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరగకముందే హైమాస్ట్ వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

సింగరేణి స్థలం కబ్జాకు యత్నం



లద్నాపూర్‌లోని స్థలం

రామగిరి: లద్నాపూర్ గ్రామంలోని సింగరేణి స్థలం కబ్జా చేసేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారు. ఓసీపీ–2 గనికి వెళ్లే దారిలో ఉన్న ఖాళీ స్థలాన్ని గ్రామానికి చెందిన వ్యక్తులు కబ్జాకు ప్రయత్నించగా.. ఆదివారం సమాచారమందుకున్న సింగరేణి ఎస్‌అండ్‌పీసీ సిబ్బంది వచ్చి అడ్డుకున్నారు. అక్కడున్న సింగరేణికి సంబంధించిన హద్దు రాళ్లు తొలిగించడంతోపాటు ఇట్టి స్థలం నాదే అని గ్రామానికి చెందిన వ్యక్తులు సింగరేణి అధికారులకు తెలిపారు. సోమవారం సర్వే నిర్వహిస్తామని, అప్పటివరకు ఎలాంటి పనులు నిర్వహించొద్దని సింగరేణి అధికారులు సూచించారు. సర్వే అనంతరం భూమి ఎవరి ఆధీనంలో ఉందో తెలియనుంది. సింగరేణి భూములు అన్యాక్రాంతం కాకుండా ఖాళీ స్థలాల్లో కంచెలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడిని సత్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం కేంద్ర నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. యైటింక్లయిన్‌కాలనీ భవాని గార్డెన్‌లో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ధరావత్ పంతుల్ విజయం సాధించారు. 11 ఏరియాల కమిటీ సభ్యులు కలిసి జనరల్ సెక్రటరీగా భూక్య నాగేశ్వరరావు, జనరల్ వైస్ ప్రెసిడెంట్‌గా భాస్కరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దశరథ్, కొత్తగూడెం రీజినల్ వైస్ ప్రెసిడెంట్‌గా రామసింగ్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకట్రావు, కృష్ణ, సెంట్రల్ కమిటీ కోశాధికారిగా రాంబాబు, రామగుండం రీజినల్ జాయింట్ సెక్రటరీ వెంకటయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల నిర్వహణ అధ్యక్షుడు భాస్కరరావు, 11 ఏరియాల ఎన్నికల అధికారులు, ఎన్నికల లైజన్ ఆఫీసర్లు పేర్కొన్నారు.

శిథిలావస్థ గదులు కూల్చివేత



సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పాత భవనాన్ని కూల్చివేశారు. శిథిలావస్థకు చేరడంతో భవనం ఉపయోగంలో ఉండడం లేదని అధికారుల నివేదిక ప్రకారం కలెక్టర్ డీఎంఎఫ్ నిధులతో కూల్చివేశారు. వేసవికాలం ముందే హైస్కూల్ భవనం నిర్మాణం చేయాలనే సంకల్పంతో నిధులు మంజూరు చేశారు. కూల్చివేసిన స్థలంలోనే హైస్కూల్ భవనం నిర్మాణం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రూ.1.50కోట్లతో నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నట్లు తెలిసింది.

దుస్తులు అందజేత



మాట్లాడుతున్న శరత్‌కుమార్

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 21వ డివిజన్ వీర్లపల్లి గ్రామంలోని ఈశ్వర కృప వృద్ధాశ్రమాన్ని భారత ప్రభుత్వ అడవులు వాతావరణ మార్పుల సంయుక్త కార్యదర్శి పల్లెర్ల శరత్‌కుమార్ ఆదివారం సందర్శించారు. శరత్‌కుమార్ మాట్లాడుతూ.. ఈశ్వర కృప వృద్ధాశ్రమం ఆహ్లాదకరమైన వాతావరణంలో వృద్ధులకు ఆహార సంరక్షణ, వసతి కల్పించినందుకు ఆశ్రమ నిర్వాహకులను అభినందించారు. ఆశ్రమంలోని వృద్ధులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఏజెంట్ చిలుక శ్రీనివాస్, లచ్చన్న, ఆశ్రమ నిర్వాహకులు పీటీ స్వామి, డైరెక్టర్ గంట సత్తయ్య, మాధవరెడ్డి, సుక్క లింగమూర్తి, లక్ష్మీరాజం, బట్టల వెంకటయ్య, జుక్క సత్యనారాయణ, కోటగిరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ప్రచారం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: ప్రధాని మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా కౌన్సిల్ సభ్యులు రాజగోపాల్, శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లిలో ఆదివారం ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ అవతరించిన తర్వాత బీఆర్ఎస్ పాలన, కాంగ్రెస్‌లో సాగుతున్న వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని అన్నారు. నాయకులు తంగెడ రాజేశ్వర్‌రావు, సంపత్‌రావు, శ్రీధర్, ఉమేశ్, శివయ్య, కృష్ణమోహన్, అంజి, శ్రీకాంత్, మహేశ్, ముంజ రాజేందర్, రమేశ్, నోముల శ్రీను తదితరులున్నారు.

బీరువా అందజేత

సుల్తానాబాద్‌రూరల్: మంచిరామి గ్రామానికి చెందిన ఈరెల్ల చక్రవర్తి–లక్ష్మి దంపతుల కూతురు పెళ్లికి తాళ్లపల్లి ఆగయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తాళ్లపల్లి మనోజ్‌గౌడ్ ఆదివారం బీరువా అందజేశారు. మాజీ ఎంపీపీ రామారావు, శ్రీనివాస్, గట్టయ్య, కుమార్ తదితరులున్నారు.